ప్రజాశక్తి
సోమవారం 1 డిసెంబర్ 2025
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు



లోగో ఆవిష్కరణ

క్రందుకూరు :కందుకూరు పట్టణ మొబైల్ టెక్నీషియన్స్ అందరూ కొత్తగా ఏర్పాటు చేసుకున్న అసోసియేషన్ ముఖ్య సమావేశానికి ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పట్టణంలోనివెంగమాంబ ఫంక్షన్ హాల్ లో జరిగిన ఈ కార్యక్రమంలో సభ్యులందరూ ఎంఎల్ఎ ఇంటూరిని ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే నాగేశ్వరావు మాట్లాడుతూ మొబైల్ టెక్నీషియన్స్ అందరూ ఒక్కతాటిపైకి వచ్చి అసోసియేషన్ ఏర్పాటు చేసుకోవడం శుభ పరిణామమని అన్నారు. ఏ సభ్యుడికి కష్టం వచ్చినా, మిగతా సభ్యులందరూ అండగా నిలవాలని సూచించారు. అసోసియేషన్ కార్యక్రమాలకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే నాగేశ్వరావు భరోసా కల్పించారు. రాజకీయాలకు అతీతంగా అసోసియేషన్ నిర్వహించుకోవాలని, అలాగే పదవులన్నీ ఏకగ్రీవాలు చేసుకోవడం వల్ల ఐకమత్యం పెరుగుతుందని వివరించారు.టెలికాం రంగంలో రోజురోజుకు విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని, మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా టచ్ మొబైల్స్ రిపేర్ల పై శిక్షణ పొందాలని ఎమ్మెల్యే వారికి సూచించారు. ప్రకాశం జిల్లా మొబైల్ టెక్నీషియన్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, కందుకూరు అధ్యక్షులు రియాజ్, ఉపాధ్యక్షులు షేక్ సలాం, సెల్ వరల్డ్ షాప్ నిర్వాహకులు శ్రీకాంత్ పలువురు మొబైల్ టెక్నీషియన్స్ పాల్గొన్నారు.

గంజాయి మాఫియాపై 'పోరు'

- ప్రజలు భాగస్వాములు కావాలి
- వామపక్షాలు పిలుపు
- 2న జిల్లా బంద్
- ఐక్య ఉద్యమం చేస్తాం : శ్రీధర్‌రెడ్డి
- పెంచలయ్య హత్యను ఖండిస్తున్నాం.. కాకాణి

మాట్లాడుతున్న వామపక్ష పార్టీల నేతలు

ప్రజాశక్తి-నెల్లూరు : గంజాయి మాఫియా, అరాచక శక్తులు దాడిలో ప్రజానాట్య మండలి కళాకారుడు కె.పెంచలయ్య మృతి చెందడం బాధాకరమని, ఈ హత్యను నిరసిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో డిసెంబరు 2న జిల్లా వ్యాపితంగా బంద్ చేపట్టనున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పేర్కొన్నారు. గంజాయి మాఫియాపై పోరాటం సాగిస్తామని, అందులో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.ఆదివారం నగరంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో వామపక్ష పార్టీలు సంయుక్తంగా విలేకర్ల సమావేశం నిర్వహించాయి. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శ మూలం రమేష్, సిపిఐ సీనియర్ నాయకులు రామరాజు మాట్లాడారు. తాను నివసిస్తున్న కాలనీలో గంజాయి, డ్రగ్స్ వినియోగించడం వల్ల యువత తమ బంగారు భవి ష్యత్తు దెబ్బతిం టుందని తన పాటలతో చైతన్యపరిచిన కళాకారుడిపై గంజాయి మాఫియా కత్తులతో దాడిచేసి హత్య చేయడం దారుణమన్నారు. ఈ దారుణాన్ని నిరసిస్తూ , భవిష్యత్తులో ఇటువంటి ఘటనలో పునరావృతం కాకుండా ఉండేందుకు పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2న చేపట్టే బంద్‌కు రాజకీయ పార్టీలు, ప్రజలు మద్దతు ఇవ్వాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, ఎం. మోహన్‌రావు, సిఐటియు నాయకులు కె.అజయ్ కుమార్, టి.వి.వి ప్రసాద్, పౌరహక్కుల సంఘం నాయకులు శివశంకర్, సిపిఐ ఎంఎల్ నాయకులు రాంబాబు పాల్గొన్నారు.

కామాక్షి వైసిపి నాయకురాలు : శ్రీధర్‌రెడ్డి

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి సిపిఎం నాయకులు కె. పెంచలయ్య హత్య కేసులో ఏ1గా ఉన్న అరవ కామాక్షి వైసిపి నాయకురాలని, నెల్లూరు రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. దొంగలు పడ్డ ఆరు నెలలకి కుక్కలు మొరిగినట్లు వైసిపి నేతలు ఆరోపణలు చేస్తున్నారన్నారు.సిపిఎం నేత పెంచలయ్య హత్య జరిగి మూడు రోజులు అవుతుంటే, వైసిపి నేతలు కనీస ఆ కుటుంబాన్ని పరామర్శించేందుకు కూడా రాలేదని, హత్యచేసిన వ్యక్తులు వారితో ఉండేవారు కాబట్టే, మొఖం చెల్లక రాలేదన్నారు. సిపిఎం నేతలు ప్రెస్ మీట్ పెట్టి పెంచలయ్యని దారుణగా దుర్మార్గంగా హత్య చేసింది వైసిపి నాయకులు అని చెప్పారన్నారు. పెంచలయ్య మరణానికి నేను కానీ, నా తమ్ముడు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి కానీ, స్థానిక కార్పొరేటర్ ఆరవ శ్రీనివాసులు కారణం అని సిపిఎం ఒక్కమాట చెబితే సిపిఎం ఏ నిర్ణయం తీసుకుంటే ఆ నిర్ణయానికి కట్టుబడి ఉంటానన్నారు. జగన్ ఇటీవల నెల్లూరుకి వచ్చినప్పుడు కామాక్షి, జేమ్స్ వందల మంది గంజాయి బ్యాచ్‌లని తీసుకువచ్చింది. నిజమా?... కాదా?... ఆనం విజయకుమార్ రెడ్డి, ఓ కార్పొరేటర్ ద్వారా కామాక్షి నుంచి రూ.5లక్షలు తీసుకున్నారనే ప్రచారం ఉందని, విచారణలో తేలుతుందన్నారు. పెంచలయ్య హత్యతో నాకు సంబంధం ఉందని సిపిఎం నేతలు అంటే, వారే శిక్ష విధించిన నేను సిద్ధంగా ఉన్నానన్నారు. వైసిపి నేతల్లారా... అసత్య ఆరోపణలు చేయడం మానుకోండి.. ఇష్టారీతిన విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. పెంచలయ్య కుటుంబాన్ని సిపిఎం నేతలతో కలిసి ఆదుకుంటామన్నారు. రానున్న రోజుల్లో గంజాయిపై ఐక్య ఉద్యమం నిర్వహిస్తామని తెలిపారు.మీడియా సమావేశంలో టిడిపి నాయకులు అరవ శ్రీనివాసులు పాల్గొన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ శ్రీధర్‌రెడ్డి

పెంచలయ్య హత్యను ఖండిస్తున్నాం : కాకాణి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నెల్లూరు గంజాయి కి అడ్డాగా మారిందని వైసిపి నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం ఆయన స్థానిక వైసిపి కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. గంజాయి మత్తులో జరిగే హత్యలను అడ్డుకోవడంలో ప్రభుత్వం విఫలమైం దన్నారు. ఇటీవల సిపిఎం నాయకుడు పెంచలయ్య హత్య జరిగిందని, దీన్ని వైసిపి తీవ్రంగా ఖండిస్తుం దన్నారు. హత్యకు పాల్పడిన, ప్రేరేపించిన వారిని వెంటనే అదుపులోకి తీసుకొని శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. పెంచలయ్యను హత్య చేసినవారు టిడిపికి సంబంధించినవారేనన్నారు. ఆ విషయాన్ని పక్కదారి పట్టించేందుకు టిడిపి యత్నిస్తుందన్నారు. అందులో భాగంగానే సిపిఎం చేయ బోయే బందుకు, నిరసన ర్యాలీలకు టిడిపి మద్దతు తెలుపు తుందని ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

మాట్లాడుతున్న కాకాణి

ప్రజలు అప్రమత్తం..

ప్రజాశక్తి-కందుకూరు : దిత్వా తుపాన్ నేపథ్యంలో కందుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా జల్లులు కురుస్తున్నాయి. ఆదివారం రాత్రి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు చెప్పారు. అధికారులందరూ మరింత అప్రమత్తంగా ఉండి, సమన్వయంతో పని చేయాలన్నారు. మున్సిపల్, పోలీసు, విద్యుత్ శాఖల సిబ్బంది రాత్రింబవళ్లు అలర్ట్ గా ఉండాలి. తుఫాను ప్రభావం తగ్గేదాకా ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అవసరమైన చోట టిడిపి నాయకులు, కార్యకర్తలు సహాయక చర్యల్లో పాల్గొనాలని సూచించారు.

నెల్లూరు కార్పొరేషన్ : బంగాళాఖాతంలో దిత్వా తుపాన్ కొనసాగుతున్న నేపథ్యంలో నెల్లూరుజిల్లా ప్రజలను, అధికారులను మంత్రి నారాయణ అప్రమత్తం చేశారు..ఎప్పటికప్పుడు పరిస్థితుల్ని మంత్రి అధికారులను అడిగి తెలుసు కుంటున్నారు... ఇటు కార్యకర్తలతో సమావేశం నిర్వహించి ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని దిశా నిర్దేశం చేస్తున్నారు..కమిషనర్ నందన్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్ళపాక అనురాధ, నగర అధ్యక్షులు మామిడాల మధు..అధికారులు, టిడిపి ముఖ్య నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'ఇంటూరి'కి సన్మానం

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలిపిన సందర్భంగా ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావుకు ఎపి రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ అభినందనలు తెలిపింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుని ఆదివారం ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్, కందుకూరు డివిజన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. డివిజన్ అధ్యక్షులు ఎస్. విజయభాస్కర్, అసోసియేట్ ప్రెసిడెంట్ మధుసూదన్ రావు, ట్రెజరర్ రమణయ్య, కార్యవర్గ సభ్యులు సాయి తేజ, శ్రీకాంత్, సింగయ్య , ఇతర సభ్యులు పాల్గొన్నారు.

పెంచలయ్య హత్య కేసులో

ఏడుగురు నిందితులు అరెస్ట్

కత్తులు, మూడు బైక్‌లు స్వాధీనం

ప్రజాశక్తి-నెల్లూరు : ప్రజానాట్య మండలి యువ కళాకారుడు, సిపిఎం నేత కె పెంచలయ్య గంజాయి మాఫియా చేతిలో హత్యకు గురైన విషయం రాష్ట్ర వ్యాపితంగా సంచలనం కలిగించింది. ఈ హత్య కేసులో మొత్తం 14 మంది నిందితులు ఉండగా ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఆ వివరాలను ఆదివారం రూరల్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రూరల్ డిఎస్‌పి ఘట్టమనేని శ్రీనివాసరావు వెల్లడించారు. ఈనెల 28న కె పెంచలయ్య తన చిన్న కుమారుణ్ని స్కూల్ నుంచి ఇంటికి తీసుకొస్తున్న సమయంలో బైక్‌పై వచ్చిన కొంత మంది స్కూటర్‌తో గుద్ది కత్తులతో దాడి చేసిహత్య చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఆమంచర్ల ప్రాంతంలో నాగుల జానకిరాం అలియాస్ ఝూన్ (24), దరా విష్ణువర్ధన్ (22), అరవ సతీష్ (19), మిందాల లోహిత్ (22), ఈగ వినయ్ (21), కల్లూరు సతీష్ (18), అరవ జోసెఫ్ (40) అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ హత్యకు వినియోగించిన మారణా యుధాలను, 3 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఆయన డిఎస్‌పి మీడియా మాట్లాడుతూ గతంలో ఆర్‌డిటి కాలనీలో అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా ఉండేదని, వాటిని నియంత్రించేందుకు ప్రజానాట్యమండలి కళాకారుడు, మృతుడు కె.పెంచలయ్య, పోలీసులు కృషి చేశారన్నారు. ఇది ఓర్వలేక పెంచలయ్యను హత్య చేశారన్నారు. ఇందులో జెమ్స్ కీలక పాత్ర పోషించారన్నారు. ఈ వ్యవహారానికి ప్రధాన సూత్రధారి అయిన అరవ కామాక్షి గంజాయి కేసులో పోలీసులు అరెస్టు చేశారని, త్వరలో పీటీ వారెంట్‌తో అదుపులోకి తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో వేదాయపాళెం పోలీసు స్టేషన్ సిఐ శ్రీనివాసరావు, పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి

పోలీసుల అదుపులో కామాక్షి

25 కేజీల గంజాయి సీజ్

నవాబుపేట పోలీసు స్టేషన్ పరిధిలో కిన్నెర ప్రసాద్ లే అవుట్‌లో అక్రమంగా రవాణా చేసేందుకు సిద్ధంగా ఉన్న 25 కేజీల గంజాయి కేసులో అరవ కామాక్షిని పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం నవాబుపేట పోలీస్‌స్టేషన్‌లో సిఐ వేణు గోపాల్‌రెడ్డి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో గంజాయి స్వాధీనం, మహిళా అరెస్టుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. పోలీసు శాఖకు లభించిన పక్కా సమాచారం మేరకు, కిన్నెర ప్రసాద్ లే అవుట్ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ క్రమంలో 25 కేజీల గంజాయిని అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న అరవ కామాక్షిని అదుపులోకి తీసుకుని గంజాయిని సీజ్ చేశామన్నారు. నిందితురాలిని పోలీసులు విచారించగా కల్లూరుపల్లి ప్రాంతంలోని ఆర్‌డిటి కాలనీలో ప్రజానాట్యమండలి కళాకారుడు కె.పెంచలయ్య హత్య కేసులో కీలక పాత్ర పోషించినట్లు గుర్తించామన్నారు. ఈ దాడులల్లో రూరల్ పోలీసు స్టేషన్ సిఐ జి వేణు, నవాబుపేట పోలీసు స్టేషన్ ఎస్ఐ శివయ్య, ఎస్.ఎ రహీమాన్, ఆర్‌వి రత్నయ్య, ఎం.వేణు, షేక్ గౌస్‌బాషా, జి.మస్తానయ్య, డి.చంద్రశేఖర్లు పాల్గొన్నారు.

నేడు విద్యా సంస్థలకు సెలవు

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి : దిత్వా తుపాన్ కారణంగా జిల్లాలో చలి గాలులు వీస్తున్నాయి. ఆదివారం జిల్లా వ్యాపితంగా మోస్తరు వర్షపు జల్లులు పడ్డాయి. ఉదయం నుంచి సాయంత్ర వరకు ఈ జల్లులు పడ్డాయి. సోమవారం భారీ వర్షం ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో జెసి ఎం వెంకటేశ్వర్లు సోమవారం విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. సోమవారం జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను కూడా రద్దు చేసినట్లు ఆయన తెలిపారు.

'గూడూరు'ను నెల్లూరులో కలపాలి : వైసిపి

నెల్లూరు అర్బన్ : కూటమి ప్రభుత్వం గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చి ఇప్పుడు మాట తప్పారని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని మాజీ మంత్రి అధ్యక్షులు కాకాని గోవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక డైకాస్ రోడ్ లోని వైయస్సార్సీపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.

బంద్‌కు మద్దతు : ఎస్ఎఫ్ఐ

నెల్లూరు : ప్రజానాట్యమండలి కళాకారుడు, సిపిఎం సభ్యులు కె.పెంచలయ్య మృతికి నిరసనగా వామపక్ష పార్టీలు 2వ తేదిన నిర్వహిం చతలపెట్టిన జిల్లా బంద్‌కు ఎస్ఎఫ్ఐ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం జిల్లా నాయకులు ప్రకటించారు. జిల్లాలో మత్తు పదార్థాలు మాదకద్రవ్యాలు వంటి వ్యసనాలకు విద్యార్థులు యువకులు బానిసల వుతున్నారన్నారు. దీన్ని ఉక్కు పాదంతో అణిచివేయాల్సిన అవసరముం దన్నారు.

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ సరికాదు

ప్రజాశక్తి - ఉలవపాడు : కూటమి ప్రభుత్వం,ప్రభుత్వం మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతూ ఆదివారం ఉలవపాడు మండల వైసిపి ఆధ్వర్యంలో బద్దిపూడి గ్రామ పంచాయతీ నందు కోటి సంతకాల కార్యక్రమంనిర్వహించారు.

పెంచలయ్యకు నివాళి

ప్రజాశక్తి-నెల్లూరు

గంజాయి మాఫియా, అరాచకశక్తులు నిర్వహించిన దాడిలో మృతి చెందిన ప్రజానాట్యమండలి కళాకారుడు కె.పెంచలయ్యకు వామపక్ష పార్టీలు ఘన నివాళు అర్పించాయి. ఆదివారం సిపిఎం జిల్లా కార్యాలయంలో పెంచలయ్య మృతిని పురస్కరించుకోని సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో సంతాప కార్యక్రమం నిర్వహించారు. సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు పాల్గొని ప్రజానాట్యమండలి కళాకారుడు సేవలను కొనియాడారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ ఒక కళాకారుడిగా, డప్పు వాయిద్యకారుడిగా పెంచలయ్య సేవలు మరువ లేనివన్నారు. ప్రజానాట్యమండలి కళాకారుడు ఏమేలు మాట్లాడుతూ చిన్నతనం నుంచి కమ్యూనిస్టు భావాలపట్ల ఆకర్షితుడై పనిచేశారన్నారు. ఈ క్రమంలో ఆర్‌డిటి కాలనీలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న సంఘ వ్యతిరేక శక్తుల చర్యలకు అడ్డు నిలిచారన్నారు. ఇది సంహించలేక గంజాయి మాఫియా కత్తులతో దాడి చేసి హత్యచేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా ప్రజా నాట్యమండలి కళాకారుడు కె.పెంచలయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, ఎం.మోహన్‌రావు, సిఐటియు నాయకులు కె.అజయ్‌కుమార్, టి.వి.వి ప్రసాద్, పౌరహక్కుల సంఘం నాయకులు శివశంకర్,సిపిఐ ఎంఎల్ నాయకులు రాంబాబు, ఐద్వా నగర కమిటీ నాయకులు కత్తి పద్మా, టి.శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

పెంచలయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సిపిఎం నాయకులు

'ఐలు అభ్యర్థులను గెలిపించండి..!

ప్రజాశక్తి-నెల్లూరు: న్యాయవాద వృత్తి విలువలను కాపాడే 'ఐలు' అభ్యర్థులను బార్ కౌన్సిల్ ఎన్నికల్లో విజయానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఐలు జాతీయ అధ్యక్షులు సుంకర రాజేంద్ర ప్రసాద్, జాతీయ కౌన్సిల్ సభ్యులు సత్తు అంకయ్య పిలుపు నిచ్చారు. ఆదివారం నగరంలోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి కళ్యాణ మండపంలో ఐలు (ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్) రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర నలుమూలల నుంచి న్యాయవాదులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షులు సుంకర రాజేంద్ర ప్రసాద్, జాతీయ కౌన్సిల్ సభ్యులు సత్తు అంకయ్య విలేకర్లతో మాట్లాడుతూ, ఫిబ్రవరిలో జరిగే ఏపీ బార్ కౌన్సిల్ ఎన్నికల్లో ఐలు అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు.న్యాయవాద సమస్యలకే కాకుండా, సామాజిక అంశాలపై కూడా పోరాటం కొనసాగిస్తోందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు కుమార్, కార్యదర్శి ఎన్.మాధవరావు, రాష్ట్ర నాయకులు నర్రా శ్రీనివాస్,పి.వి.పి. లక్ష్మీ, చుక్కా రమేష్, జక్కా శేషమ్మ, కష్ణుడు, గంపా సుధీర్, పరిమళ, గుంజి దయాకర్, కొండలరావు, పిఎన్‌వి సాయి, జి. బాలసుబ్రమణ్యం, పచ్చా కిరణ్, మాల్యాద్రి, చంద్ర పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సుంకర రాజేంద్ర ప్రసాద్

ఆ 'ఒక్కరి' కే.. టిడిపి దాసోహం..!

"గూడూరును నెల్లూరులో కలుపుతాం...మీ కోరకి తీర్చుతాం" చంద్రబాబునాయుడు.."నేను హామీ ఇస్తున్నా పార్టీ అధికారంలోకి వచ్చాక గూడూరు ప్రజల తీరుతుంది" నారా లోకేష్... ఏరుదాటే వరకు ఓడ మల్లయ్య....ఏరుదాటాక బోడిమల్లయ్య అన్నట్లు ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ పరిస్థితి ఉంది.. గూడూరు ప్రజల కోరికతో పనిలేదు...స్థానిక ఎంఎల్ఎ పాశం సునీల్‌కుమార్ మాటకు విలువు లేదు...ఉమ్మడి నెల్లూరు జిల్లాలో పదికి పది స్థానాలు ఇచ్చిన నెల్లూరు జిల్లా ప్రజలతో అధికార టిడిపి ఆటలాడుతోంది. పార్టీలోని సీనియర్ నాయకులతో మాట మాత్రం చెప్పకుండా...కనీసం ఒక్క మాట మాట్లాడకుండా గూడూరు నియోజవర్గంతోపాటు, రాపూరు, సైదాపురం, కలువాయి మండలాలను తిరుపతిలో కలిపేస్తున్నట్లు ప్రకటించారు.. ఇంతమందిని కాదని ఒక్క వ్యక్తి కోసం టిడిపి నాయకత్వం పనిచేస్తుందనే విమర్శలు వస్తున్నాయి..

గూడూరు ప్రజలకు నమ్మక ద్రోహం - చంద్రబాబు...లోకేష్ మాట హామీ విస్మరించారు..

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం .సింహపురి ప్రజల ఆశలపై నీళ్లు చల్లుతోంది. గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపాలని అక్కడ ప్రజలు బలంగా కొరుతున్నారు. స్థానిక ఎంఎల్ఎ పాశం సునీల్‌కుమార్ అనేక సార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.. ప్రస్తుతం ప్రభుత్వ ప్రతిపాదనల ప్రకారం కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో విలీనం చేయనున్నారు. నెల్లూరు జిల్లాలో ఉన్న సైదాపురం, కలువాయి., రాపూరు మండలాలను గూడూరు డివిజన్‌లో చేర్చి తిరుపతి జిల్లాలో ఉంచనున్నారు. ఈ నిర్ణయంతో జిల్లా ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు, యువనేత నారా లోకేష్ ఇచ్చిన హామీలను మరిచిపోయినట్లు కనిపిస్తోంది. గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరులో చేర్చుతామని చెప్పిన వారు ప్రస్తుత ప్రతిపాదనలో ఎక్కడా చోటు ఇవ్వలేదు. గూడూరు నియోజకవర్గం మండలాలు, ఏయే మండలాలు జిల్లాలో చేరుతాయి. జనాభా, ఇతర భౌగోళిక స్వరూపాన్ని తెప్పించుకున్నారు. 25 రోజుల క్రితం కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రభుత్వానికి నివేదిక పంపారు. అంతా ఒకే ప్రకటనే తరువాయి అనుకన్న సమయంలో ప్రభుత్వ నిర్ణయంతో ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆ ఒక్కరికోసమేనా..!

గూడూరు మున్సిపాలిటీ, గూడూరు రూరల్, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాలను నెల్లూరులో కలిపేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఎంఎల్ఎ పాశం సునీల్‌కుమార్ అనేక సార్లు ప్రభుత్వాని గుర్తు చేశారు. అసెంబ్లీలోనూ ప్రస్తావించారు. అంతా ఒకే అయింది ఏమీ దిగులు వద్దు అంటూ చంద్రబాబు, లోకేష్ హామీ ఇచ్చారు... అయితే రాత్రికి రాత్రే ఈ నిర్ణయం ఎలా మారిందనే అనుమానాలు కలుగుతున్నాయి.. గూడూరు డివిజన్‌లోని సూళ్లూరుపేట, వెంకటగిరి, గూడూరు నియోజకవర్గాలను ఓ కాంట్రాక్టర్, బడా వ్యాపారవేత్త, టిడిపికి ఫైనాన్స్ నడుపుతున్నారనే ప్రచారం ఉంది. గత ఎన్నికల్లో పెద్ద మొత్తంలో నగదు ఖర్చుచేశారని చెబుతున్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక ఆయన అవినీతికి అడ్డుఅదుపు లేకుండా పోయిం దంటున్నారు. చిల్లకూరులోని సిలీకా, స్వర్ణముఖీ నదీ పరివాహక ప్రాంతాల్లో ఇసుక, సైదాపురంలోని మైనింగ్, రాపూరు ప్రాంతంలో క్వాజ్, ఇతర ప్రాంతాల్లో ఉన్న సహజవనరులను ఇష్టం వచ్చినట్లు దోచుకుంటున్నారనే ప్రచారం జోరుగా ఉంది.అన్ని విషయాల్లో వారి జోక్యం ఉంటుంది. అందుకే గూడూరు నియోజకవర్గాన్ని తిరుపతిలోకి మార్పు చేశారని ప్రచారం ఉంది.

సైదాపురం మైనింగ్

కండలేరు జలాశయం

టిడిపి నేతల మాటకు విలువ లేదా..?.

నెల్లూరు జిల్లా ప్రజలతో అప్పుడు వైసిపి, ఇప్పుడు టిడిపి ఆదుకుంటుంది. ముక్కలు ముక్కలు చేసి,జిల్లా స్వరూపాన్నే మార్చేశారు. ఇప్పుడు కందుకూరును ప్రకాశంలో కలపడాన్ని ఎవ్వరూ తప్పుపట్టడం లేదు. గూడూరును నెల్లూరులో కలిపే విషయంలో మంత్రివర్గ ఉపసంఘం వ్యవహంచిన తీరుపై నిరసన వ్యక్తమౌతున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో అధికార టిడిపికి ప్రజలు స్పష్టమైన మెజార్టీ ఇచ్చారు, ఏదైనా నిర్ణయం తీసుకునే సమయంలో పార్టీలోని సీనియర్ నాయకులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, పార్టీలోని ముఖ్యులు పి. నారాయణ, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీద రవిచంద్ర వంటి నేతలతో మాట్లాడి నిర్ణయం తీసుకోంటారని అందరూ బావిస్తారు. విచిత్రమేమంటే జిల్లాలోని అధికారపార్టీ నేతలతో ఎవ్వరితోనూ ఒక్క మాట కూడా పార్టీ కాని, ప్రభుత్వంలోని పెద్దలు గాని మాట్లాడలేదని తెలుస్తోంది. ఏక పక్షంలో కీలకమైన నిర్ణయాలు ప్రకటించారు. స్దానిక ఎంఎల్ఎ పాశం సునీల్‌కుమార్ మాటలను పరిగణంలోనికి తీసుకోలేదు దీంతో తన పదవికి రాజీనామా చేస్తానని ఆయన ప్రకటించారు. సీనియర్ నాయకులు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి లేఖ రాశారు. దీనిని పట్టించుకోలేదు..ఈ నేపథ్యంలో కోవూరు మాజీ ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నిరవధి నిరాహార దీక్ష చేస్తామని తెలిపారు. దీంతో అధికారపార్టీనేతలకు ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది.

ప్రజల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం..!

నెల్లూరు జిల్లా విభజనతో ప్రజల మధ్య చిచ్చుపెట్టేలా కనిపిస్తోంది. నెల్లూరు జిల్లాకు ఏ ఒక్క వనరు లేకుండా పోతోంది. కండలేరు జలాశయం రాపూరు ప్రాంతంలో ఉంది. ఇది తిరుపతి జిల్లాకు వెళిలే సాగు 90 శాతం నెల్లూరు జిల్లాలోనే ఉంది. ఇక్కడ రైతులు, ప్రజల మధ్య సాగునీటి యుద్ధమే జరిగే అవకాశం ఉంది. తిరుపతికి శ్రీసిటి, షార్, మేనకూరు సెజ్, శ్రీకాళహస్తి , తిరుపతి దేవాలయాలు, వెంకటగిరి, నేలపట్టు, వంటి ఎన్నో ప్రత్యేకతలున్నాయి. నెల్లూరు జిల్లాకు సోమశిల ప్రాజెక్టు, ఆదానీ కృష్ణపట్నం పోర్టు తప్ప ఏమీ లేదు. ఒకప్పుడు ఎంతో ప్రాముఖ్యత, ప్రాదన్యత ఉన్న సింహపురిని పాలకులు చిందర వందర చేశారు.

అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : దిత్వా తుపాన్ హెచ్చరిక నేపథ్యంలో అధికార యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశించారు. తుపాన్ హెచ్చరికలపై అధికారులకు మంత్రి అమరావతి నుంచి అప్రమత్తం చేస్తూ పలు సూచనలు చేశారు. పెన్నానది పరివాహక ప్రాంతాలు, మండలాల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తీరప్రాంత గ్రామాలపై పూర్తి అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. మత్స్యకారులను వేటకు వెళ్లకుండా అవగాహన కల్పించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ఎటువంటి ముప్పునైన సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రెవెన్యూ, పోలీసు యంత్రాంగం సంసిద్ధంగా ఉండాలన్నారు. అన్ని చెరువులు, వాగుల వద్ద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ఇరిగేషన్ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు అన్నిశాఖల అధికారులు సంసిద్ధంగా ఉండాలని, ప్రజలందరికీ ప్రభుత్వం అండగా ఉంటుందనే భరోసాను అధికార యంత్రాంగం కల్పించాలని సూచించారు. ఆదివారం తాను కూడా జిల్లాలో అందుబాటులో ఉంటూ జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు తుపాను ముప్పును ఎదుర్కొనేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా మంత్రి ఆనం తెలిపారు. ఆయా ప్రాంతాల ఎన్‌డిఎ కూటమి నేతలంతా.. ప్రజలకు అందుబాటులో ఉండి సమర్థవంతంగా ఎదుర్కోవాలని కోరారు. విద్యుత్, వైద్య, రవాణా, పోలీసు, రెవెన్యూ శాఖలతో పాటు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

పోలీస్ శాఖ సిద్ధంగా ఉండాలి

ప్రజాశక్తి-కలిగిరి : దిత్వా తుపాను హెచ్చరికలు నేపథ్యంలో కలిగిరి మండల ప్రజలు అందరూ అప్రమత్తంగా ఉండాలని కలిగిరి పోలీస్ శాఖ ఎలాంటి అత్యవసర పరిస్థితినైనా ధైర్యంగా ఎదుర్కునేందుకు సంసిద్ధంగా ఉందని కలిగిరి ఎస్ఐ ఎం.ఉమాశంకర్ తెలిపారు. మండలంలోని కమ్మవారిపాలెం, పరికోట, చిన్న అన్నలూరు, పాతనాపురం, పెద్ద అన్నలూరు, గంగిరెడ్డిపాలెం చిన్న చెరువు కలిగిరి గ్రామాల వద్ద ఉన్న సప్తాలపై నీరు ప్రవహిస్తున్నప్పుడు వాహనదారులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు వాగులు, వంకలు, కాలువలు ఉన్న పరిసర గ్రామ ప్రజలు చేపల వేటకు, సరదాగా ఈత కొట్టడానికి ఎట్టి పరిస్థితుల్లో వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. నీటి ప్రవాహం ఉన్న వాగుల సప్తాలపై ప్రయాణించేటప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. తుపాను దృష్ట్యా అధికారులు సూచనలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. మండల పరిధిలో ప్రతి గ్రామంలో చిన్నపిల్లలను, బడిఈడు పిల్లలను నీటి గుంటల దగ్గరికి వెళ్లనివ్వకుండా తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా ప్రతి గ్రామంలో చెరువులు నీటి గుంటలు నిండుగా నీటితో ఉన్నాయి ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకొని అప్రమత్తంగా ఉండాలని కోరారు. దిత్వా తుపాను దృష్ట్యా భారీ వర్షాలు కురిసే సమయంలో అత్యవసరమైతే తప్ప ఇళ్లను వదిలి బయటకు రావద్దని ఎస్ఐ ఉమా శంకర్ కోరారు.

కాలువలో పడి మోటార్ సైక్లిస్ట్ మృతి

ప్రజాశక్తి-కొడవలూరు రూరల్ : కాలువలో పడి మోటార్ సైక్లిస్ట్ మృతి చెందిన సంఘటన మండలంలోని ఆలూరుపాడు మజరారెడ్డిపాలెం వద్ద శుక్రవారం రాత్రి చోటుచేసుకొంది. ఆదివారం ఉదయం ఈ విషయం వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఆలూరుపాడు ఎస్‌సి కాలనీకి చెందిన రొల్ల వంశీకృష్ణ (30) సొంత పనిపై బయటకు వెళ్లి శుక్రవారం రాత్రి తిరిగి ఇంటికి వస్తూ రెడ్డిపాలెం వద్ద బైక్‌తో సహా కాలువలో పడ్డారు. కాలువలో పడ్డ అతడిపై బైక్ పడిపోవడంతో అక్కడే మృతి చెందారు. స్థానికుల ద్వారా మరుసటి ఉదయం కుటుంబ సభ్యులకు తెలిసింది. కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చెరుకొని బోరుమని విలపించారు. అనంతరం మృతదేహాన్ని ఇంటికి తీసుకుపోయారు. మృతుడికి వివాహమై భార్య, ఒక పాప ఉన్నారు. మృతుడు గ్రామంలో చిల్లర దుకాణం నడుపుకొంటూ కుటుంబాన్ని పోషించుకొంటున్నారు. మృతుడికి మూర్ఛ వ్యాధి ఉన్నట్లు సమాచారం.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-కావలి : దిత్వా తుపాను తీవ్రత నేపథ్యంలో కావలి నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంఎల్‌ఎ కావ్య కృష్ణారెడ్డి సూచించారు. వాతావరణ శాఖ విడుదల చేసిన హెచ్చరికలను గమనించి అవసర మైన భద్రతా చర్యలు పాటించాలని ఎంఎల్‌ఎ విజ్ఞప్తి చేశారు. దిత్వా తుపాన్ ప్రభావం పెరగడంతో నెల్లూరు జిల్లాకు రెడ్ అలెర్ట్ జారీ చేసినట్లు వాతావరణ శాఖ ప్రకటించింది. భారీవర్షాలు, ఈదురుగాలులు నమోదయ్యే అవకాశాల నేపథ్యంలో ప్రజలు తప్పనిసరిగా ఇళ్లలోనే ఉండాలని అధికారులు సూచించారు. దిత్వా తుపాను ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిందని ఎంఎల్‌ఎ కావ్య కృష్ణారెడ్డి తెలిపారు. తుపాన్ సమయంలో అత్యవసర సేవలు నిరంతరంగా అందుబాటులో ఉండేలా సంబంధిత శాఖలతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అన్ని శాఖల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్, విద్యుత్, నీటి పారుదల, వ్యవసాయ, పోలీస్, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు చూడాలన్నారు.

జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు పంచాయతీ కప్పరాల తిప్ప గ్రామంలో క్రిస్టన్ నూతన సంవత్సర సందర్భంగా డిసెంబర్ 6వ తేదీ నుండి టిడిపి క్రికెట్ టోర్నమెంట్ జిల్లాస్థాయిలో ఎంఎల్‌ఎ కావ్య కృష్ణారెడ్డి సహకారంతో నిర్వహిస్తున్నట్లు కప్పరాల తిప్ప టిడిపి యూత్ నాయకులు క్రాంతి కుమార్, మనోహర్, రంజిత్ కుమార్, రవి, శేఖర్, కృష్ణ, వినీత్, అభ్యుదయ్, జి. బాబు, అలెక్స్ తెలిపారు. వారు మాట్లాడుతూ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనదలచిన వారు రూ.1000 కట్టి తమ పేర్లు నమోదు చేసుకోవాలని, గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ.30వేలను 9వ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ ఇందుపూరు రామ్మోహన్ రెడ్డి, రెండవ బహుమతి ఆపుల ప్రతాప్ జ్ఞాపకార్థం వారి కుమారుడు ఆపుల రంజిత్‌కుమార్ రూ.20వేలు, ద్వితీయ బహుమతి కప్పరాల తిప్ప టిడిపి కార్యకర్తలు రూ.10వేలు బహుమతిగా అందిస్తారని తెలిపారు.

విపిఆర్ ఉచిత నేత్ర సేవలు

ప్రజాశక్తి - ఉదయగిరి : డిసెంబర్ 1వ తేదీ నుండి 6వ తేదీ వరకు విపిఆర్ ఉచిత నేత్ర సేవలు మండలంలో అందించడానికి ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి బస్సును ఏర్పాటు చేశారని ఈ అవకాశాన్ని పంచాయతీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల అధ్యక్షులు చింతలచెరువు బయన్నయాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకటవ తేదీ సోమవారం గండిపాలెం పంచాయతీ లో ప్రారంభమై రెండవ రోజు మంగళవారం వెంగళరావు నగర్ పంచాయతీలో మూడవరోజు బుధవారం తిరుమలాపురం పంచాయతీ నాలుగవ తేదీ గురువారం అప్పసముద్రం పంచాయతీ ఐదవ తేదీ శుక్రవారం దాసరపల్లి పంచాయతీ ఆరవ తేదీ శనివారం ఉదయగిరిలో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అందిస్తున్న ఈ ఉచిత నేత్ర వైద్య సేవలు అనుభవజ్ఞులు వైద్యులచే అందిస్తున్నారని వైద్యసేవలు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమగుమందులు అందజేస్తారన్నారు.

ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి-బిట్రగుంట : ఫ్రెండ్స్ హోప్ హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ వారి సహకారంతో బోగోలు పంచాయతీలో ఉన్న నివసిస్తున్న పేద ముస్లిం కుటుంబానికి నిత్యావసర సరుకులు ఫౌండేషన్ సభ్యులు ఇంటర్నేషనల్ కరాటే మాస్టర్ రవి గన్, పేట శ్రీధర్ ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అనే నినాదంతో ఫ్రెండ్స్ హోప్ హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ స్థాపించి ఫౌండేషన్ ద్వారా బోగోలు మండలంలోని పేదలకు నిరుపేదలకు ఆర్థికసాయాన్ని తమవంతు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఎలక్షన్ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-కోవూరు : కోవూరు మండలం పరిధిలోని పోతిరెడ్డిపాలెం గ్రామంలో ఆదివారం విపిఆర్ ఫౌండేషన్ సౌజన్యంతో జొన్నవాడ దేవస్థానం ఛైర్మన్ తిరుమూరు అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ యువతకు క్రికెట్ కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమూరు అశోక్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించడం ద్వారా యువతలో ఆత్మవిశ్వాసం, శారీరక దారుఢ్యం పెరుగుతుందని తెలిపారు. క్రీడల యువతను సానుకూల దారిలో నడిపిస్తాయని, భవిష్యత్తులో కూడా యువత అభివృద్ధికి అవసరమైన సౌకర్యాల అందించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి యద్దలపూడి, నాగరాజు, మాజీ సర్పంచ్ అంగిరేకుల కష్ణ ప్రసాద్, దంపూరు శ్రీనివాసుల రెడ్డి, ఒట్టూరు వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు, యువత పెద్దఎత్తున హాజరై తిరుమూరు అశోక్ రెడ్డికి, విపిఆర్ ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పెంచలయ్య హత్యకు నిరసనగా కొవ్వొత్తులతో ర్యాలీ

- గంజాయి మూకలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి - రేపటి బంద్‌ను జయప్రదం చేయాలని సిపిఎం పిలుపు

నెల్లూరు రూరల్‌లో..

ప్రజాశక్తి-నెల్లూరు : గంజాయి మాఫియా, అరాచకమూకల చేతిలో అత్యంత కిరాతకంగా చంపబడ్డ సిపిఎం కార్యకర్త, ప్రజానాట్య మండలి కళాకారుడు పెంచలయ్య హత్యకు నిరసనగా ఆదివారం రూరల్ పరిధిలోని ఆర్‌డిటి కాలనీలో సిపిఎం 23, 24డివిజన్ శాఖల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. నగరంలో జోరువాన కురుస్తున్నా లెక్క చేయకుండా చేపట్టిన ఈ నిరసన ప్రదర్శనకు భారీగా ప్రజలు స్వచ్ఛందంగా తరలి వచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, జిల్లా కమిటీ సభ్యులు కె.పెంచల నరసయ్య మాట్లాడుతూ ఆర్డిటి కాలనీలో ప్రశాంతమైన వాతావరణ ఏర్పాటు చేసి ప్రజలను, యువకులను చైతన్యవంతం చేస్తూ గంజాయి మూకల చేతిలో హత్య హత్య గావించబడడం దారుణం. ఇటువంటి గంజాయి బ్యాచిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గంజాయి కి వ్యతిరేకంగా పోరాటం చేస్తుంటే కిరాయి మూకల చేత హత్య చేసిన వారిని, వారి వెనుక ఉన్న వారిని అరెస్ట్ చేసి, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ రెండో తేదీన జిల్లా జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న సమ్మెను జయప్రదం చేయాలని, ప్రజలు, వ్యాపార సంస్థల ఈ బందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గునుకుల కిషోర్, సిపిఎం పార్టీ రూరల్ కమిటీ సభ్యులు ఒంగోలు సుధీర్, ఎస్.కె.షాహినా బేగం, ఎం.సుధాకర్, ఎస్కె శంషాద్, నాయకులు కె.సురేష్, కామయ్య, వీర్ల శ్రీనివాసులు, షబ్బీర్, కృష్ణమూర్తి, ఏ మేలు, ఆర్.డి.టి. కాలనీ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నవలాకు తోట ప్రాంతంలో.. గంజాయి మాఫియా, అరాచకమూకల చేతిలో అత్యంత కిరాతకంగా చంపబడ్డ సిపిఎం పార్టీ కార్యకర్త, ప్రజానాట్యమండలి కళాకారుడు పెంచలయ్య హత్యకు నిరసనగా నవలాకుతోట ప్రాంతంలో సిపిఎం శ్రేణులు క్యాండిల్ ప్రదర్శన నిర్వహించారు. ఈ ర్యాలీలో ప్రజలు స్వచ్ఛందంగా భారీ స్థాయిలో పాల్గొని గంజాయి రహిత సమాజానికి కృషి చేస్తామని, కిరాయి గుండాల, గంజాయి మాఫియా ఆటకట్టించేందుకు పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎఐడిఎస్‌ఒ ఆధ్వర్యంలో.. రూరల్ ప్రజా నాట్యమండలి కార్యదర్శి పెంచలయ్యని కొందరు దుండగులు క్రూరంగా హత్య చేశారు. ఈ ఘటనలో పాల్గొనిన వారిపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని కఠిన శిక్షలు విధించాలని ఏఐడిఎస్‌ఒ డిమాండ్ చేసింది. పెంచలయ్య మరణంపై వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించింది. తెలియజేస్తున్నాము. సమాజంలో మద్యం, మాదకద్రవ్యాలు, డ్రగ్స్, గంజాయి వంటి వాటి విస్తృత లభ్యత వల్ల యువత జీవితం నాశనమవుతోంది. నిన్నటి హత్య కూడా దీని ఫలితమే అన్నారు.

ఎఐఎఫ్‌టియు (న్యూ) ఆధ్వర్యంలో.. సిపిఎం కార్యకర్త, ప్రజా కళాకారుడు కామ్రేడ్ పెంచలయ్యను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని. నేర సంస్కృతి కారణమైన మద్యం, గంజాయి, మత్తు పదార్థాలను అరికట్టాలని రైతు కూలీ సంఘం, ఎఐఎఫ్‌టియు, స్త్రీ విముక్తి సంఘం పిలుపు నిచ్చాయి. యువ కళాకారుడు కాలనీలో చైతన్యం కలిగిస్తూ పాటలతో ప్రజలను ఏకతాటిపైకి తెచ్చిన పెంచలయ్యపై గంజాయి, మత్తు పదార్థాల మూకా కక్ష పెంచుకుని, తమ కార్యకలాపాలకు అడ్డుగా భావించి హత్యకు పాల్పడింది. గంజాయి, మత్తు పదార్థాల విక్రయాలను ప్రభుత్వాలు అడ్డుకోకడంలో విఫలమయ్యాయి.

టిపి గూడూరులో..

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : సిపిఎం రూరల్ నాయకులు పెంచలయ్యను హత్య చేసిన హంతకులను కఠినంగా శిక్షించాలని జిల్లా ఆటో కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మారుబోయిన రాజా సిపిఎం మండల కార్యదర్శి ఈపూరు లక్ష్మయ్య డిమాండ్ చేశారు. నెల్లూరు రూరల్ సిపిఎం సభ్యుడు, ప్రజా నాట్యమండలి రూరల్ కార్యదర్శి పెంచలయ్యను గంజాయి ముఠా చేసిన హత్యను ఖండిస్తూ ఆదివారం తోటపల్లి గూడూరు పోలీస్ స్టేషన్ సెంటర్లో కొవ్వొత్తుల ప్రదర్శన జరిగింది. సిపిఎం ఇస్కపాలెం శాఖ కార్యదర్శి బండి సౌరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాజా, లక్ష్మయ్య పాల్గొన్నారు. నరుకూరు సెంటర్లో కూడా నిర్వహిస్తున్నట్లు సిపిఎం మండల కమిటీ తెలియజేశారు. బంద్‌కు వ్యాపారస్తులు, పాఠశాలలు, కళాశాలలు స్వచ్ఛందంగా బంద్ పాటించి, ప్రజలందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మోచర్ల రాధయ్యా, ఇనమాల కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

గుడ్లూరులో..

ప్రజాశక్తి-గుడ్లూరు : నెల్లూరులో సిపిఎం నాయకులు ప్రజానాట్యమండలి కళాకారులు పెంచలయ్యను గంజాయి ముఠా రౌడీలు దారుణంగా హత్య చేయడంపై గుడ్లూరులో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన ఆదివారం జరిగింది. హత్యకి నిరసనగా దోషులను కఠినంగా శిక్షించాలని డిసెంబర్ 2న జరగబోయే బందు జయప్రదం చేయాలని మండల సిపిఎం కన్వీనర్ జి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. స్థానిక గుడ్లూరు ఉన్నత పాఠశాల దగ్గర నుంచి నిరసన ర్యాలీ ప్రదర్శన జరిగింది. సిపిఎం శాఖ కార్యదర్శి గుత్తి మల్లికార్జున, రైతుసంఘం నాయకులు దామా కృష్ణయ్య, ధన్యాసి బాలకోటయ్య, వల్లెపు కొండయ్య, నేలటూరి తిరుపాలు, గిరిజన మహిళా సంఘం నాయకురాలు కోటేశ్వరమ్మ, రామాలు, శ్రీనివాసులు రెడ్డి, కే మాల కొండయ్య ఉన్నారు.

కావలిలో..

ప్రజాశక్తి-కావలి : సిపిఎం నెల్లూరు నగరంలో ఆంధ్ర ప్రజానాట్య మండలి ప్రజా కళాకారుడు, సిపిఎం నేత కె.పెంచలయ్యను గంజాయి మూకలు హత్య చేయడాన్ని ఖండిస్తూ సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం కావలి ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ అంబేద్కర్ బొమ్మ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. జోరువానలో గొడుగులు వేసుకుని, కొవ్వొత్తులు చేత బట్టి పార్టీ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఈ హత్యను ఖండిస్తూ 2వ తేదీన జరిగే జిల్లా బంద్‌లో ప్రజలు, ప్రజాస్వామ్య వాదులు అందరూ పాల్గొని బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.తిరుపాలు, బి.కృష్ణయ్య, మేడ వెంకటేశ్వర్లు, చెన్నయ్య, డివైఎఫ్ఐ నాయకులు పెంచల నరసింహం, కె.చెన్నయ్య, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎస్.కె.హమ్మద్, సిపిఎం, ప్రజా సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : డిసెంబర్ 2న జరిగే జిల్లా వ్యాప్త బందును ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని జయప్రదం చేయాలని జిల్లా ఆటో యూనియన్ కార్యదర్శి మారు బోయిన రాజా పిలుపునిచ్చారు. సిపిఎం నేత కె.పెంచలయ్యను దారుణంగా హత్య చేసిన గంజాయి మాఫియాకు కఠిన శిక్షలు విధించాలని ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి మారుబోయిన రాజా డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర పిలుపు మేరకు ఇందుకూరుపేటలో ఆదివారం నిర్వహించిన కొవ్వొత్తుల నిరసన కార్యక్రమంలో ఆయన ప్రధాన వక్తగా పాల్గొన్నారు. పెంచలయ్య హత్యకు నిరసనగా సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిన డిసెంబర్ 2 జిల్లా బంద్‌ను మండల ప్రజలంతా స్వచ్ఛందంగా పాల్గొని బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మైపాటి కోటేశ్వరరావు, సిఐటియు మండల గౌరవాధ్యక్షులు ఎస్.కె.చాంద్ బాషా, కోనేటి వెంకయ్య, నాయుడు, తదితరులున్నారు.

ఇందుకూరుపేటలో..

అనంతసాగరంలో..

ప్రజాశక్తి-అనంతసాగరం : సిపిఎం సభ్యుడు పెంచలయ్యను గంజాయి ముఠా చేసిన హత్యకు అనంతసాగరం బస్టాండ్ సెంటర్‌లో సిపిఎం ఆధ్వర్యంలో సంతాపం తెలిపి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కమిటీ సభ్యులు డాక్టర్ సుబ్బారాయుడు, సిపిఎం మండల కార్యదర్శి అన్వర్ బాషా మాట్లాడుతూ పెంచలయ్యను హత్య చేయించిన అరవ కామాక్షి ఆమె ముఠా సభ్యులను కఠినంగా శిక్షించాలని జిల్లాలో గంజాయి ముఠాలు ఎక్కువగా ఉన్నాయని వారి వల్ల జిల్లాలో హత్యలు జరుగుతున్నాయన్నారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు వేము పెంచలయ్య, గాడి సుధాకర్, జక్రయ్య, సందాని, మీరా మొహిద్దీన్, మస్తాన్, ఇమ్రాన్, వంశీ, పెంచల నరసింహులు, తదితరులున్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : రాష్ట్రంలో గంజాయిని బెల్టు షాపులను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బోగోలు మండల సిపిఎం శాఖ సీనియర్ నాయకులు తుమ్మల వెంకయ్య పేర్కొన్నారు. సిపిఎం నేత, నెల్లూరు జిల్లా ప్రజా కళాకారుడు కె.పెంచలయ్య హత్యను ఖండిస్తూ బోగోలు మండల సిపిఎం కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కడనూతల శాఖ కార్యదర్శి పోట్లూరి శ్రీనివాసులు, విశ్వనాథరావుపేట శాఖ కార్యదర్శి ఎన్.రామయ్య, బోగోలు మండల సిఐటియు కార్యదర్శి బాదుల్లా,

బిట్రగుంటలో..

బోగోలు మండలం భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు తుమ్మల సీనయ్య, మండల సిఐటియు అధ్యక్షులు చల్ల నరహరి, ఉపాధ్యక్షులు ఎస్కె.అమర్ భాషా, సిపిఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కోవూరులో..

ప్రజాశక్తి-కోవూరు : ప్రజానాట్యమండలి జిల్లా కమిటీ సభ్యులు పెంచలయ్య మృతికి కోవూరు మండల కమిటీ సంతాపం కార్యక్రమాన్ని స్థానిక సీతాపోలయ్య భవనం లో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్కె అప్రోచ్ అధ్యక్షుడిగా వ్యవహరించారు. తొలుత పెంచలయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ప్రజానాట్యమండలి వారు గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా ప్రజానాట్య మండలి సీనియర్ నాయకులు విజయ్ కుమార్, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి గండవరపు శేషయ్య మాట్లాడారు. పెంచలయ్య ప్రజానాట్య మండలికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గండవరపు బుజ్జయ్య, నాయకులు ఎస్కె బాబు, హరి, చాంద్ భాషా, నంద్యాల రాజశేఖర్, చెన్నయ్య, రమేష్, పెద్దబ్బయ్య, ఎస్థాని, సురేష్, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిలో..

ప్రజాశక్తి బుచ్చిరెడ్డిపాలెం : గంజాయి ముఠాకు రాజకీయ నాయకుల అండదండలు మెండుగా ఉన్నాయని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జొన్నగడ్డల వెంకమరాజు అన్నారు. సిపిఎం కార్యాలయంలో టౌన్ కార్యదర్శి పోతంశెట్టి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆదివారం గంజాయి ముఠా కారణంగా దారుణంగా హత్యకు గురైన పెంచలయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి కొవ్వొత్తుల ర్యాలీ సిపిఎం నాయకులు ప్రదర్శించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి గండవరపు శ్రీనివాసులు, సిఐటియు కార్యదర్శి చల్ల కొలుసు మల్లికార్జునరావు, దామరమడుగు శాఖ కార్యదర్శి జి.సురేష్, పుత్తేటి.మల్లికార్జున, మండల కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

ప్రజాశక్తి-వింజమూరు

వింజమూరులోని జిల్లా పరిషత్ పాఠశాలలో యుటిఎఫ్ మండల నూతన కౌన్సిల్ సమావేశంలో విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి వి చలపతి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడుతూ పిఆర్‌సి ఫిట్‌మెంట్ ఐఆర్ 30శాతం పెండింగ్ డిఎలు వెంటనే ప్రకటించాలని కోరారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుండి విముక్తి కలిగించాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా నాయకులు బాల రాఘవులు, చెంచల బాబు, సీనియర్ నాయకులు కామాక్షయ్య, పెద్ద వెంకయ్య, చిన్న వెంకయ్య, మండల నాయకులు వెంకటేశ్వర రెడ్డి, వీరాంజనేయులు, పరమేశ్వరరావు, మౌలాలి, సుబ్బారావు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం అన్నదాతగా ముందుకొచ్చిన పెద్దలు గువ్వల కృష్ణారెడ్డి రిటైర్డ్ అయిన జిల్లా మండల అవార్డు గ్రహీత ఉపాధ్యాయులకు వీరందరికీ గౌరవ సత్కారం సన్మానించారు.

యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

గౌరవ అధ్యక్షులు వై.పరమేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షులు వి.వసంతకుమారి ప్రతాప్, అధ్యక్షులు ఆర్.వెంకటేశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.వీరాంజనేయులు, కోశాధికారి ఎస్కె మీరావాలి, జిల్లా కౌన్సిలర్స్ జి.చెంచల బాబు, కె.కృష్ణారెడ్డి, సంక్షేమ కన్వీనర్ జి రెడ్డయ్య, పత్రికా కన్వీనర్ సుబ్బారావు, సిపిఎస్ కన్వీనర్ మాల్యాద్రి, మహిళా కన్వీనర్ కే విజయ్ కుమారి ఎన్నికయ్యారు.

కాంగ్రెస్‌కు కార్యకర్తలే బలం

ప్రజాశక్తి-కావలి

మాట్లాడుతున్న ఆసన్ మౌలానా

కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే అసలైన బలమని, సంస్థాగతంగా పార్టీని కిందిస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎఐసిసి పరిశీలకులు, తమిళనాడు ఎంఎల్ఎ ఆసన్ మౌలానా స్పష్టం చేశారు. రాబోయే ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం కావలి పట్టణంలోని కలయిక కల్యాణ మండపంలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణకార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎఐసిసి పరిశీలకులు ఆసన్ మౌలానా, రాష్ట్రస్థాయి నాయకులు హాజరయ్యారు. కావలి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ పొదల కూరు కల్యాణ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఎఐసిసి పరిశీలకులకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆసన్ మౌలానా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవాన్ని తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. రాష్ట్రంలో పార్టీని సంస్థాగతంగా మరింత బలంగా తీర్చిదిద్దేందుకు అన్ని రకాల చర్యలు తీసుకునే భాగంలోనే ఈ సమీక్షా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వివరించారు. మండలాల వారీగా, బూత్‌ల వారీగా కమిటీల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని నియోజక వర్గ ఇన్‌ఛార్జ్‌లను ఆదేశించినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీని విజయపథంలో నడిపించేందుకు అవసరమైన పటిష్ఠమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, ప్రజా సమస్యలపై పోరాట వ్యూహాలు, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన విధానాలపై ఎఐసిసి పరిశీలకులు వారికి దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పొదల కూరు కల్యాణ్ మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా నియోజకవర్గంలో కాంగ్రెస్ శ్రేణులను ఏకం చేసి, సంస్థాగత నిర్మాణాన్ని పూర్తి చేస్తామని వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు చేవూరు దేవకుమార్ రెడ్డి, జిల్లా నాయకులు ఎల్. సురేష్, బాబు, శ్రీనివాస్ గౌడ్, వివిధ నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మంత్రి ఆనం పర్యటన

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ప్రతినెలా ఒకటో తేదీన రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పేదల సేవలో ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సంగం మండలం గాంధీ జనసంఘంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల కార్యక్రమంలో పాల్గొంటారు. సోమవారం ఉదయం 9 గంటలకు గాంధీ జనసంఘం గిరిజన కాలనీలో అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి మంత్రి పర్యటిస్తారు. సామాజిక పింఛన్లను లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి అందిస్తారు. వారి యోగక్షేమాలు తెలుసుకుంటారు. అనంతరం గాంధీజనసంఘంలో రూ.32 లక్షలతో నిర్మించనున్న గ్రామపంచాయతీ నూతన భవన పనులను, రూ.5లక్షలతో నిర్మించనున్న రామాలయం కాంపౌండ్ వాల్ పనులను రూ.14 లక్షల ఎన్‌ఆర్‌జిఎస్ నిధులతో మంజూరు చేసిన సిసి రోడ్లను పరిశీలిస్తారు.

గొప్ప సంఘసంస్కర్త 'గురజాడ'

ప్రజాశక్తి-అనంతసాగరం

దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్ అని వెల్లిగెత్తి చాటిన తెలుగు వైతాళికుడు, బాల్య వివాహాలు కన్యాశుల్కం వంటి సాంఘిక దురాచారాలను ఎదిరించిన గొప్ప సంఘసంస్కర్త శ్రీ గురజాడ అప్పారావు అని అనంతసాగరం గ్రంథభాండాగారి పేర్కొన్నారు. గ్రంథాలయంలో ప్రతి ఆదివారం నిర్వహించే "చదవడం మాకు ఇష్టం" కార్యక్రమంలో భాగంగా ఆదివారం ప్రముఖ తెలుగు కవి సంఘసంస్కర్త గురజాడ అప్పారావు 110 వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో కచ్చిరి దేవరాయపల్లి పుస్తక పంపిణీ కేంద్ర నిర్వాహకుడు భాను ప్రకాష్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలు ఇళ్లల్లోనే ఉండాలి

ప్రజాశక్తి-బిట్రగుంట : దిత్వా తుపాను తీవ్రత నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ సానా శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దిత్వా తుపాన్ ప్రభావం పెరగడంతో నెల్లూరు జిల్లాకు రెడ్అలెర్ట్ జారీ చేసినట్లు వాతావరణ శాఖ ప్రకటించిందని, భారీవర్షాలు, ఈదురుగాలులు నమోదయ్యే అవకాశాల నేపథ్యంలో ప్రజలు తప్పనిసరిగా ఇళ్లలోనే ఉండాలని సూచించారు. ప్రజలు అత్యవసరమైన తప్ప ఎవరు కూడా ఇళ్లలో నుంచి బయటికి రావద్దని తెలిపారు.

ఆరుగురు నిందితులు అరెస్ట్..

- కావలి డి.ఎస్.పి. శ్రీధర్ వెల్లడి

ప్రజాశక్తి-కావలి

మాట్లాడుతున్న కావలి డిఎస్‌పి శ్రీధర్

జలదంకి మండలం గట్టుపల్లి చింతలపాలెం గ్రామానికి చెందిన గొట్టిపాటి గట్టుపల్లి ప్రసాద్ నాయుడు హత్య కేసులో పాల్గొన్న తలశిల వెంకట నరసింహారావు, కొక్కిలగడ్డ వెంకటరావు, తిరుమలశెట్టి డెనియల్, పీట ప్రవీణ్‌కుమార్, లంకె నరసింహరాజు, సైకం నరేంద్ర అనే ఆరుగురు నిందితులను ఆదివారం మధ్యాహ్నం మద్దూరుపాడు హైవే అండర్ పాస్ వద్ద అరెస్ట్ చేయడమైనదని కావలి డి.ఎస్.పి. పి. శ్రీధర్ వెల్లడించారు. జలదంకి మండలం గట్టుపల్లి చింతలపాలెంలో నవంబర్ 26వ తేదీ పట్టపగలు 11.40 గంటలకు గొట్టిపాటి ప్రసాద్ నాయుడు హత్య కేసుకు సంబంధించి దర్యాప్తులో ప్రధాన కుట్రదారుడు కృష్ణాజిల్లా, నాగాయలంక గ్రామానికి చెందిన తలసిల వెంకట నరసింహారావు అని నిర్ధారణ జరిగిందన్నారు. గారపాటి సదాశివరావుతో తనకు ఉన్న ఆర్థిక, భూ వివాదాన్ని పరిష్కరించు కోవడానికి తలసిల వెంకట నరసింహారావు ప్రయత్నించగా, మతుడు గొట్టిపాటి ప్రసాద్ నాయుడు, ఏ.వెంకట ప్రసాద్ నాయుడు సదరు భూ సమస్య పరిష్కారం కాకుండా సదాశివరావుకు స్థానికముగా మద్దతు ఇస్తూ, సమర్థిస్తున్నాడని, సదాశివరావు మృతుడు సపోర్టుతో తలసిల వెంకట నరసింహ రావుపై గతంలో అనేక కేసులు పెట్టి, ఇబ్బంది పెట్టినట్లు, ఈ విషయమై నరసింహారావుకు భూమి విషయాలలో నష్టం జరుగుతుందని భావించి, మృతుడుని చంపితే సదాశివరావుకు ఎలాంటి స్థానిక బలం ఉండదని, తనకు ఉన్న భూ సమస్య త్వరగా పరిష్కరించుకోవచ్చని భావించి, ప్రసాద్ నాయుడిని ఎలాగైనా హత్య చేయాలని నిర్ణయించుకొని, ఈ నేరానికి గతములో నేర చరిత్ర ఉన్న పులిగడ్డపల్లిపాలెం గ్రామానికి చెందిన కొక్కిలిగడ్డ వెంకటరావు అని రౌడీ షీటర్‌ను సంప్రదించి, హత్యకు అవసరమైన వ్యక్తులను సమకూర్చమని కోరాడన్నారు. వెంకటరావు తన మిత్రుడు, పలు హత్య కేసులలో నిందితుడిగా ఉన్న రౌడీ షీటర్ సైకం నరేంద్రను సంప్రదించగా, నరేంద్ర తనకు తెలిసిన నేరచరిత్ర కలిగిన దానియేలు, నర్సింగరాజు, ప్రవీణ్ కుమార్‌ను తీసుకు వెళ్ళగా, నిందితులు అందరు కలసి ప్రసాద్ నాయుడిని హత్య చేయాలని ప్రణాళిక రచించి, గత రెండు నెలల సమయంలో గట్టుపల్లి చింతలపాలెం ప్రాంతాల్లో నిందితులు రహస్యంగా రెక్కి నిర్వహించి, ప్రసాద్ నాయుడు ఒంటరిగా ఉన్నప్పుడు చంపాలని ప్రయత్నించి, 3సార్లు విఫలమై, చివరికి వారు వేసుకున్న ప్రణాళిక ప్రకారం 26.11.2025 ఉదయం 11.40 గంటల సమయంలో మృతుడు ప్రసాద్ నాయుడు తన కోళ్ల ఫారంలో ఉండగా, కోళ్ళు కావాలనే సాకుతో దానియేలు, ప్రవీణ్ కుమార్ కోళ్లఫారం లోపలికి ప్రవేశించి ప్రసాద్ నాయుడిపై దాడి చేశారు. ప్రవీణ్ కుమార్, ప్రసాద్ నాయుడి నోరు మూసి వెనుక నుంచి కదలకుండా గట్టిగా పట్టుకోగా, దానియేలు తన వద్ద ఉన్న కొడికత్తితో ప్రసాద్ నాయుడిని పలు సార్లు పొడిచి హత్య చేశాడు. అదే సమయంలో నర్సింగరాజు బయట వారికి కాపలా ఉన్నాడు. ఈ కేసు ప్రాథమిక దర్యాప్తును మొదట కలిగిరి సి.ఐ. పి.వెంకట నారాయణ చేపట్టగా, నెల్లూరు జిల్లా ఎస్‌పి డాక్టర్ అజిత వేజెండ్ల, ఆదేశాల మేరకు, పారదర్శకమైన దర్యాప్తు కోసం ఈ కేసు తదుపరి దర్యాప్తును నెల్లూరు సిసిఎస్ సి.ఐ. సిహెచ్ సీతారామయ్యని ప్రత్యేక అధికారిగా నియమించగా, సిసిఎస్ సిఐ తదుపరి దర్యాప్తు చేపట్టి ఆదివారం నిందితులను అరెస్టు చేయడమైనదని డి.ఎస్.పి. తెలిపారు. పోలీసులు 4 రోజుల్లోనే హంతకులను గుర్తించి, కిరాయి హత్య కేసును విజయవంతంగా ఛేదించారు. ఈ సంఘటన జిల్లావ్యాప్తంగా సంచలనంగా మారిన నేపథ్యంలో, కేసును జిల్లా ఎస్‌పి అజిత వెజెండ్ల అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని, స్వయంగా పర్యవేక్షిస్తూ, కేసు త్వరితగతిన ఛేధించేందుకు కఠినమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ అత్యంత క్లిష్టమైన కేసును స్వల్ప సమయంలో ఛేదించినందుకు జిల్లా ఎస్.పి. దర్యాప్తులో పాల్గొన్న బృందాన్ని అభినందించి, వారి కృషి, నిబద్ధతను కొనియాడారు. ఈ విజయవంతమైన ఆపరేషన్‌లో భాగమైన సిబ్బందికి రివార్డులు ప్రకటించారు. ఈ సమావేశంలో కలిగిరి సి.ఐ. వెంకట నారాయణ, సిసిఎస్‌సిఐ సీతారామయ్య, కావలి 1వ, 2వ, పట్టణ సి.ఐ.లు ఫిరోజ్, గిరిబాబు, జలదంకి ఎస్.ఐ. పాల్గొన్నారు.

"పినాకిని తీరంలో కవితా ఘలం ఘలలు"

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

పినాకిని తీరంలో కవితా ఘలం ఘలలు.. ఈతకోట సుబ్బారావు కవితా సమాలోచన కావ్యంను ప్రముఖ రచయిత విమర్శకులు ఎంవీ రామిరెడ్డి ఆవిష్కరించారు. ఆదివారం మినర్వా గ్రాండ్ సమావేశ మందిరంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంవీ రామిరెడ్డి మాట్లాడు తూ తెలుగు సాహిత్యంలో సోమసుందర్ ఒక లెజెండ్ అని వారి ప్రశంస పొందడం అభినందనీయమన్నారు. సాహిత్య చరి త్రకు ఇలాంటి ప్రముఖుల రచనలు, వ్యాసాలు అవసరమన్నారు. వ్యాసం రికార్డ్ కావటం అభినందనీయమని అది వర్తమా నానికి రేపటి తరానికి కూడా దిక్సూచిగా నిలుస్తుందన్నారు. ఈతకోట సుబ్బారావు కవిత్వంపై సోమ సుందర్ ఇష్టపూర్వకంగా సుదీర్ఘమైన వ్యాసం రాయటం నిజానికి ఇది గొప్ప అదృష్టం మాత్రమే కాదని రేపటి తరానికి ఇదొక చరిత్రగా నిలుస్తుంద న్నారు. సుబ్బారావు కవిత్వం మీద ఇప్పటికే పలు వ్యాసాలు సమీక్షలు కథనాలు వచ్చినప్పటికీ ప్రముఖ పండితులు సోమసుందర్ సుదీర్ఘమైన వ్యాసం, అదీ నాలుగు కవితా సంపుటాలపై రావడం ఒక రికార్డు అయితే కాలగమనానికి కూడా రికార్డుగా నమోదు కావటమేనన్నారు. రామిరెడ్డి ఆవిష్కరించి, తొలి ప్రతిని మరో ప్రముఖ కవి సుంకర గోపాల్‌కు అందజేశారు. కార్యక్రమంలో విశాలాక్షి సంపాదకులు కోసూరు రత్నం, ప్రముఖ రచయిత్రి ఎస్‌వి నాగగాయత్రి, ప్రాచీన విశిష్ట అధ్యయన కేంద్రం రీసర్చ్ స్కాలర్ రామకష్ణ, రచయితలు ఈతకోట సుబ్బారావు దంపూరు రామకృష్ణ పాల్గొన్నారు.

ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ స్టడీ సెంటర్ ఎస్ఆర్‌జె డిగ్రీ కాలేజీ ఆత్మకూరు బిఎ, బిఎస్‌సి, బికామ్, యుజి డిగ్రీ కోర్సులకు గానూ సెమిస్టర్ విధానం. 1 అండ్ 3/5/ సెమిస్టర్ పరీక్షలకు ఫీజులు చెల్లించడానికి ఆఖరుతేదీ 27/12/2025/ లోపులో ఎపి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొనవలెను. ఒక ప్రకటన ద్వారా స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. వివరాల కోసం ఫోన్ నెంబర్ 7382929793 / 9440632594 / 8125407933 సంప్రదించాలని తెలిపారు.

దిత్వా తుపాన్‌తో జనజీవనం అస్తవ్యస్తం

ప్రజాశక్తి-విడవలూరు

దిత్వా తుపానుతో పూర్తిగా డెల్టా ప్రాంతమైన ఊటుకూరు ముదుగుర్తి తదితర ప్రాంతాలలో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది చలిగాలులతో ప్రజలు వణికిపోయారు. ఆదివారం దిత్వా తుపాను ప్రభావంతో సముద్ర తీరప్రాంతాల మత్స్యకారులు గత నాలుగు రోజుల నుంచి సముద్రంలో ఆటుపోటులు ఎక్కువగా ఉండటంతో వేటకు వెళ్ళటం లేదు. మండలంలో రైతులు పోసిన నార్మల్ వర్షంతో దెబ్బతిన్నందున రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని రైతులు కోరుకుంటున్నారు.